మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
శుక్రవారం | 24 | ఏప్రిల్ | 2026 పేజీలు: 6



# సందట్లో సడేమియాగా..

## భారీ చార్జీలు పెంచిన ప్రైవేట్ వాహనదారులు

### ఆర్టీసీ సమ్మెను క్యాచ్ చేసుకుంటున్న ప్రైవేట్ వాహనాలు

### లబోదిబోమంటున్న ప్రయాణికులు

మేడ్చల్, ఏప్రిల్ 23 ( మనం జిల్లా ప్రతినిధి ):

సందిట్లో సడే మీయగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీలు, ఆటోలు భారీ ఎత్తున చార్జీలను పెంచింది. ఈనెల 22 నుండి ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనాలకు రెక్కలు వచ్చాయి. అందిన కాడికి దోచుకోవాలన్న సంకల్పంతో ప్రైవేట్ వాహనాల ఏజెన్సీ లతోపాటు ఆటోలు తమ ఇష్టానుసారంగా చార్జీలను పెంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి . దీంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. సిటీ బస్సులతో పాటు జిల్లాలకు వెళ్లే బస్సులు సైతం డిపోలకే పరిమితం కావడం వల్ల దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు సిటీలో తిరిగే ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వాహనాలతో పాటు ఆటోలు ప్రస్తుతం ఉన్న చార్జీల పైన 50 శాతం చార్జీలను పెంచుకున్నట్లు తెలుస్తోంది.

2





## పూడూరు జెడ్పి హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

2


## సికింద్రాబాద్లో ఆర్టీసీ కార్మికుల మహాధర్నా

### - తలసాని మద్దతు

2



# సందట్లో సడేమియాగా...



**భారీ చార్జీలు పెంచిన ప్రైవేట్ వాహనదారులు**

**ఆర్టీసీ సమ్మెను క్యాచ్ చేసుకుంటున్న ప్రైవేట్ వాహనాలు**

**లబోదిబోమంటున్న ప్రయాణికులు**



మేడ్చల్, ఏప్రిల్ 23 ( మనం జిల్లా ప్రతినిధి ): సందిట్లో సడే మీయగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీలు, ఆటోలు భారీ ఎత్తున చార్జీలను పెంచింది. ఈనెల 22 నుండి ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనాలకు రెక్కలు వచ్చాయి. అందిన కాడికి దోచుకోవాలన్న సంకల్పంతో ప్రైవేట్ వాహనాల ఏజెన్సీలతోపాటు ఆటోలు తమ ఇష్టానుసారంగా చార్జీలను పెంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి . దీంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. సిటీ బస్సులతో పాటు జిల్లాలకు వెళ్లే బస్సులు సైతం డిపోలకే పరిమితం కావడం వల్ల దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు సిటీలో తిరిగే ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వాహనాలతో పాటు ఆటోలు ప్రస్తుతం ఉన్న చార్జీల పైన 50 శాతం చార్జీలను పెంచుకున్నట్లు తెలుస్తోంది. కార్యాలయాలకు వెళ్లాలన్న, వేరే ఇతరత్రా పనులకు వెళ్లాలన్నా సిటీ బస్సుల్లో వెళ్లేవారు. ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు సమ్మె లో ఉండడం.. సిటీ బస్సుల్లో ఎక్కడికక్కడ ఆగిపోవడం వల్ల ప్రయాణికులు ఆటోల పై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో ఇంతకుముందు ఉన్న రేట్లపైన 50 శాతం అధిక చార్జీలను వసూలు చేస్తూ ప్రయాణికు లను దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు మేడ్చల్ పట్టణంలో బస్టాండ్ నుండి కోర్టుకు వెళ్లాలన్నా 15 రూపాయలు తీసుకునేవారు. కానీ ప్రస్తుతం 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి

### ప్రైవేట్ వాహనాల ఏజెన్సీల దోపిడీకి అంతులేదు.

అసలే వేసవికాలం. విద్యార్థులకు పాఠశాలలు కళాశాలలు సెలవులు ప్రకటించడంతో పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు ప్రణాళికలు వేసుకుంటారు.ఆర్టీసీ సమ్మె వల్ల ప్రైవేటు బస్సులలో వెళ్ళుదాము అనుకుంటే వారు పెంచిన చార్జీలతో ప్రయాణాలను సైతం రద్దు చేసుకుంటున్నారు. తప్పదు అనుకుంటే ప్రస్తుతం ఉన్న రేట్ల కన్నా అధికంగా చెల్లిస్తూ ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

### మేడ్చల్‌లో లబోదిబోమంటున్న ప్రయాణికులు

మేడ్చల్ లో ప్రయాణికులు పెరిగిన చార్జీలతో లబోదిబోమంటున్నారు. మేడ్చల్ లో బస్ డిపో ఉండడం వల్ల నిమిషానికి ఒక పార్టీ సిటీ బస్సు అందుబాటులో ఉండేదని ప్రస్తుతం సమ్మె వల్ల బస్సులు నడవకపోవడం... ఆటోలను నమ్ముకుంటే పెంచిన చార్జీలతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బెంబేలెత్తిస్తున్న ఎండల వల్ల ఆటో లో వెళ్లే ప్రయాణికుల జేబులు ఖాళీ కావాల్సిందే.

## పూడూరు జెడ్పి హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





మేడ్చల్, ఏప్రిల్ 23 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా పూడూరు జెడ్పి హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు.

పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ తల్లిదండ్రులతో ప్రత్యేకంగా చర్చించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా ఇబ్బందిగా ఉందని, పాఠశాలకు స్కూల్ బస్సు కావాలని తల్లిదండ్రులు కలెక్టర్ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మెరుగుపరచాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే, దానికి అనుగుణంగా కొత్త బస్సును కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలలోని కంప్యూటర్ సైన్స్ ల్యాబ్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్ ఇన్స్ట్రక్టర్లతో మాట్లాడి ప్రయోగాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాఠశాలకు ఇంకేవైనా అవసరాలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందా మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట సిబ్బందితో మాట్లాడి వారికి కావాల్సిన వంట సామాగ్రి లేదా ఇతర పరికరాల అవసరాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ అనూష, రెవెన్యూ ఇన్స్పెక్టర్ చందన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. శంకరయ్య ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


## సికింద్రాబాద్లో ఆర్టీసీ కార్మికుల మహాధర్నా

**– తలసాని మద్దతు**



సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) ఆర్టీసీని ప్రయివేటీకరణ దిశగా నడిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. గురువారం సికింద్రాబాద్ రాణిగంజ్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన మహాధర్నాకు ఆయన హాజరై సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 92 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్టీసీ మనుగడను ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. సురక్షిత ప్రయాణానికి ప్రత్యేక గుర్తింపు పొందిన ఆర్టీసీ అభివృద్ధిలో వేలాది మంది ఉద్యోగుల శ్రమ ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని, వాటిని పరిష్కరించి సమ్మెను విరమింప చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఉద్యోగ భద్రతకు భంగం కలిగిస్తున్నారని, వాటిని ఆర్టీసీ ఉద్యోగులతోనే నడపాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల వారికి డ్రైవర్ బాధ్యతలు అప్పగించడం సరైంది కాదని ప్రశ్నించారు. రాణిగంజ్, గౌలిగూడ సహా ఐదు డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలనే గత ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే అమలు చేసి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల 32 డిమాండ్లలో 29 ఆమోదించామని చెబుతుండగా, వాటి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. బీఆర్ఎస్ ప్రోత్సాహంతోనే సమ్మె జరుగుతోందని కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించిన తలసాని, ఎన్నికల హామీల అమలుకే ఉద్యోగులు పోరాడుతున్నారని అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు, బీఆర్ఎస్ నేతలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కె.ఎల్.ఆర్ జన్మదిన వేడుకలు బస్తీ పిల్లలతో..







కీసర సర్కిల్, జవహర్ నగర్, ఏప్రిల్ 23 (మనం న్యూస్): మేడ్చల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ప్రస్తుతం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఉన్న కె.ఎల్.ఆర్ (కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి) 70వ జన్మదినాన్ని జవహర్ నగర్ పరిధిలోని సుక్కమ్మ బస్తీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు టీ కాలేష, ఆయన సతీమణి షర్మిల దంపతులు బస్తీ పిల్లలతో కలిసి పండుగలా జరిపారు.

ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు, పలహారాలు పంపిణీ చేసి, కేక్ కట్ చేయించి కె.ఎల్.ఆర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల ఆనందం, వారి చిరునవ్వులు దేవుని ఆశీర్వాదాలుగా భావిస్తూ, కార్యక్రమాన్ని సాదాసీదాగా కాకుండా హృదయపూర్వకంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా టీ కాలేష మాట్లాడుతూ, పీడిత వర్గాల ఆశాజ్యోతి అయిన కె.ఎల్.ఆర్ ఆలోచనలు తనను ఎంతో ప్రభావితం చేశాయని తెలిపారు. కష్టపడినవారికే తినే హక్కు అనే ఆయన సిద్ధాంతాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన జన్మదినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని చెప్పారు. ఈ రోజు తమ ఇంటిల్లిపాదికి పండుగ రోజుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కె.ఎల్.ఆర్ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆదరణ, అభిమానంతో ఆయన్ని ఎల్లప్పుడూ ఆశీర్వదించాలని కోరుకున్నారు.



ఈ కార్యక్రమంలో బస్తీ నివాసులు, పెద్దలు, పిల్లలు, కుటుంబ సభ్యులు షేక్ ముత్తుజ హైదర్, షేక్ అజ్మతుల్ హైదర్, నూర్జైన్ ఫాతిమా, సమీనా, సమీన్, జుబేరియా, ఉబేద్, ధన్విక, నిషి, రేవతి, అభిషేక్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలనలో పేదల సొంతింటి కల సహకారం

మేడ్చల్, ఏప్రిల్ 23 ( మనం జిల్లా ప్రతినిధి): కాంగ్రెస్ పాలనలో పేదల సొంతింటి కల సహకారం అవుతుందని మేడ్చల్ సర్కిల్ కాంగ్రెస్ నేతలు అన్నారు. ఇందిరమ్మ పథకం కింద నిర్మించబడిన కురాకుల జయమ్మ సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఉదండాపురం సత్యనారాయణ, మెడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సద్ది సుధర్షన్ రెడ్డి గర్దాస్ నరేందర్ పాల్గొని గృహ యజమానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో ఇందిరమ్మ పథకం ద్వారా వేలాది కుటుంబాలు తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు పెరుగుతున్న మద్దతు




మేడ్చల్, ఏప్రిల్ 23 ( మనం జిల్లా ప్రతినిధి): న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ చేపడుతున్న సమ్మెకు మద్దతు పెరుగుతుంది. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందంటూ జాన్ వెస్లీ ప్రకటించారు. ఇదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ సైతం ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు. మేడ్చల్ డిపోలో జరిగిన రెండో రోజు సమ్మెలో బిఆర్ఎస్ నేతలు పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ తక్షణమే పరిష్కరించాలని మేడ్చల్ సర్కిల్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ కోరారు. ప్రభుత్వ మొండి వైఖరిని వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మేడ్చల్ బస్సు డిపోలో రెండో రోజు ఆందోళనలు

మేడ్చల్ బస్ డిపో లో రెండో రోజు కార్మికులు ఆందోళనలు చేశారు. మేడ్చల్ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. బలవంతంగా ఉద్యమాన్ని అనిచి వేయలేరని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెను ఆపేదే లేదంటూ జేఏసీ నేతలు పేర్కొన్నారు.

## వంట గ్యాస్కు ప్రత్యామ్నాయం 'పెల్లెట్ స్టవ్'

**– హోటల్ యజమానులకు అవగాహన కల్పించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

చేవెళ్ల, ఏప్రిల్ 23 (మనం న్యూస్ ): పెరుగుతున్న గ్యాస్ ధరలు, కొరత నుంచి ఉపశమనం పొందేందుకు బయోమాస్ పెల్లెట్ స్టవ్లు ఉత్తమ ప్రత్యామ్నాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల పట్టణంలో ఫౌండేషన్ యువత రూపొందించిన వివిధ రకాల బయోమాస్ పెల్లెట్ గ్యాసిఫైయర్ స్టవ్ల పనితీరును స్థానిక హోటల్, రెస్టారెంట్ యజమానులకు స్వయంగా ప్రయోగాత్మకగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధం వల్ల ఏర్పడిన ఎల్పీజీ కొరతను దృష్టిలో ఉంచుకుని చిన్న వ్యాపారుల కోసం ఈ స్టవ్లను రూపొందించినట్లు తెలిపారు. వ్యవసాయ వ్యర్థాలైన వరి పొట్టు, జొన్న సొప్పతో తయారయ్యే పెల్లెట్స్ వాడకం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా, దేశానికి లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం మిగులుతుందని పేర్కొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో చేవెళ్ల విద్యార్థుల జోరు

**– విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య.**

చేవెళ్ల, ఏప్రిల్ 23 (మనం న్యూస్) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ చాటిన చేవెళ్ల మున్సిపాలిటీ 14వ వార్డ్ పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్,నాయక్, కళ్యాణి యాదగిరి,పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి, ఎంఈవో పురం దాస్, ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



# అక్రమంగా తరలిస్తున్న 21 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత ఇద్దరిపై కేసు నమోదు

**అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న సర్పంచ్**

**గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే సహించేది లేదు**

**జూలపల్లి సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్**



(తలకొండపల్లి ఏప్రిల్ 23/మనం న్యూస్) : ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా విక్రయిస్తున్నారని తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ పేర్కొన్నారు.

తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొని గ్రామ పంచాయతీకి తరలించి అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు ఆర్ఐ శ్రవణ్, జిపిఓ నర్సింహా వాహనాన్ని తనిఖీ చేసి, బియ్యం సంచులను తరలిస్తున్న డ్రైవర్ను, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించారు. విచారణలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టుగా గుర్తించామని వెల్లడించారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకోవడంలో సహకరించిన సర్పంచ్ శేఖర్ యాదవ్కు అధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్తో పాటు, జూలపల్లి గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు. అలాగే 7వ వార్డు సభ్యులు జి. జగదీష్, వి. గోవర్ధన్, ఎ. గోవర్ధన్, డి. అశోక్, జి. మణికంఠ, మాజీ డిప్యూటీ సర్పంచ్ బి. తిరుపతి, కె సుధాకర్, కే శివ, నాగయ్య మరియు బి. మధు తదితరులతో పాటు గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## అంబర్ నగర్లో ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ గుట్టు రట్టు


**ఐదుగురు పట్టివేత**



సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) హైదరాబాద్లోని వారసిగూడా పోలీసు స్టేషన్ పరిధిలోని అంబర్ నగర్ ప్రాంతంలో ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న గ్యాంగ్ను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో అందిన నమ్మదగిన సమాచారం మేరకు వారాసిగూడ పోలీసులు దాడి చేపట్టారు. ఈ దాడిలో సబ్ బుకీగా వ్యవహరిస్తున్న చింతకింది సాయి కిరణ్తో పాటు పంటర్లుగా ఉన్న గంట శ్యామ్ ప్రసాద్, సుంకరి రాకేష్, సయ్యద్ హయాత్లను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ప్రధాన బుకీ మాంటీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్కుఖిజి777.ఖౌఝ అనే వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారి వద్ద నుంచి రూ.1,08,500 నగదు మరియు 5 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితుల్లో ప్రధాన నిందితుడు సాయి కిరణ్ను రిమాండ్కు తరలించగా, పరారీలో ఉన్న మాంటీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## సికింద్రాబాద్లో ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టురట్టు

సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) నమ్మదగిన సమాచారంతో మహంకాళి పోలీసులు గురువారం ఉదయం కాండోజి బజార్లోని ఒక నివాసంలో దాడి చేసి, ఐపీఎల్-2026 నేపథ్యంలో సాగుతున్న అక్రమ ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాన్ని బయటపెట్టారు. ఈ దాడిని ఎస్ఐ కె. సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, ఏప్రిల్ 22న జరిగిన రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్కు సంబంధించిన బెట్టింగ్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు. స్థలంలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో పశ్చిమ బెంగాల్కు చెందిన బంగారు పనివాడు దీపక్ మండల్ (43) నగదు సేకరణ ఏజెంట్గా



వ్యవహరిస్తుండగా, స్థానిక వ్యాపారి ఎం. అనికేత్ (24) పంటర్గా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఉత్పల్ సమతా, మవీన్ పరారీలో ఉన్నారు. దాడిలో భాగంగా బెట్టింగ్ కోసం ఉపయోగిస్తున్న ఐఫోన్ 15 ప్రో మాక్స్, వివో వై21ఈ మొబైల్ ఫోన్లు, అలాగే 3,80,740 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.




## తార్నాకలో హెల్మెట్ శిల్పం ఆవిష్కరణ

**– రోడ్డు భద్రతపై అవగాహనకు ముందడుగు..**

సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) హైదరాబాద్ నగరంలోని తార్నాక జంక్షన్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బాహుబలి హెల్మెట్ శిల్పాన్ని గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ.వి. గురవారెడ్డి, సీఈఓ డాక్టర్ బి. జనార్దన్ రెడ్డి (మాజీ ఐఏఎస్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోయెల్ డేవిస్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించడం అత్యవసరమని, ముఖ్యంగా వాహనదారులు మరియు వెనుక కూర్చునే ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అవగాహన కార్యక్రమాల్లో సర్వేజన ఫౌండేషన్ తీసుకున్న వినూత్న చర్యలను ఆయన అభినందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించిన వివరాల ప్రకారం, కేంద్ర రవాణా శాఖ నివేదికల ప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.72 లక్షల రోడ్డు ప్రమాద మరణాలు నమోదవుతుండగా, వాటిలో 54 వేలకుపైగా మరణాలు హెల్మెట్ వినియోగం లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. తెలంగాణలోనే 2,200కు పైగా మరణాలు, 4,700కు పైగా గాయాలు హెల్మెట్ లేకపోవడం వల్ల సంభవిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్లో ప్రతి మూడు రోజులకు ఒక వెనుక ప్రయాణికుడు హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోతున్నాడని పేర్కొన్నారు. పోలీసు అధికారులు తెలిపిన ప్రకారం, హెల్మెట్ ధరించడం వల్ల మరణాల ప్రమాదం సుమారు 40% వరకు, తల గాయాల ప్రమాదం 70% వరకు తగ్గుతుందని వివరించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం మరియు ఇతర సంస్థలతో కలిసి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సర్వేజన ఫౌండేషన్ తెలిపింది. ప్రతి ప్రయాణం - ప్రతి సారి హెల్మెట్ ధరించండి అంటూ నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదర్శ్ అన్నపురెడ్డి, వైస్ చైర్మన్ రాము ఎలమంచిలి, సీఓఓ వి. ప్రవీణ్ కుమార్ తదితరులు, పౌర సంస్థలు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉధృతం అవుతున్న ఆర్టీసీ సమ్మె

**రేపటి నుండి చేయబోవు కార్యాచరణ ప్రకటించిన జేఏసీ**



మేడ్చల్, ఏప్రిల్ 23 ( మనం జిల్లా ప్రతినిధి ): రేపటినుండి చేయబోయే కార్యాచరణను జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. 24 న అన్ని డిపోల ముందు మౌన ప్రదర్శనలు 25 న అన్ని డిపోలలో వంటావార్పు 26ఏప్రిల్ న అన్ని రీజియన్ లలో, జిల్లాలలో కార్మిక కవాత్ 27రి న తెలంగాణ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ,ఎంపీ మంత్రులకు, వినతిపత్రాలు సమర్పించుట.

28న మహిళ ఉద్యోగు లతో అన్ని డిపోలలో బతుకమ్మలతో నిరసన ప్రదర్శనలు.29న అన్ని డిపోల ముందు అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహిస్తామని ఈ కార్యక్రమాలను విజయ వంతంగా నిర్వహించాలని ఈ రోజు జేఏసీ నిర్వహించిన అత్యవసర సమావేశంలో నిర్ణయించడం జరిగిందని మేడ్చల్ డిపో జేఏసీ చైర్మన్ శేఖర్ తెలిపారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**సమ్మెకు ఏఐఎఫ్టీయూ, రైతు కూలీ సంఘం సంపూర్ణ మద్దతు.**
**విలీన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్.**

కుషాయిగూడ, ఏప్రిల్ 23 (మనం న్యూస్): రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్టీయూ), రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. కార్మికులు చేపట్టిన సమ్మెకు ఈ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

గురువారం కుషాయిగూడలో నిర్వహించిన ఆందోళనలో ఈ సంఘాల నేతలు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.



### కమిటీల పేరుతో కాలయాపన వద్దు

కార్మికులు 41 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం నిరాశాజనకమని విమర్శించారు. ఇప్పుడు ఆఫీసర్ల కమిటీ ఏర్పాటు చేయడం కాలయాపన మాత్రమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మికుల్లో నమ్మకం కల్పించే చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు.



### ప్రధాన డిమాండ్లు ఇవే

ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా ప్రకటించి, విలీన ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి. వేతన సవరణ చేపట్టి, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి. కార్పొరేట్ ప్రయోజనాల కోసం చేపడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల పెంపును ఉపసంహరించుకోవాలి. యూనియన్ల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి.

### ప్రభుత్వానికి హెచ్చరిక

గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలైన టీఎన్జీవో, టీజీవోలు కూడా ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలపాలని కోరారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు జరిపి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టీయూ నాయకులు ఎర్రెల్లి మల్లేష్, గొల్ల అంజయ్య, పల్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సిబిఐటి కళాశాల అక్రమాలపై విచారణ వేగవంతం చేయాలి

**పీడీఎస్యు (విజృంభణ)**



సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) సిబిఐటి (అటోనమస్) ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల విభాగంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై వెంటనే విచారణను వేగవంతం చేయాలని పిడిఎస్యు (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల విభాగంలో అక్రమాలు జరిగి రెండు నెలలు గడిచినా, ఇప్పటివరకు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆధ్వర్యంలో కళాశాల తనిఖీ జరిగినప్పటికీ, సంబంధిత అంశాలపై సరైన సమాచారం సేకరించలేదని, పరిశీలించిన వివరాలను కూడా బహిరంగపరచలేదని ఆరోపించారు. అక్రమాలకు కారణమైన సిబిఐటి కంట్రోల్ల కూడా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. అక్రమంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను తక్షణమే గుర్తించి, సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ అధికారులను కోరారు. డిమాండ్లను పట్టించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# సికింద్రాబాద్ రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్, ఏప్రిల్ 23 ( మనం న్యూస్) సికింద్రాబాద్ రైల్వే పరిధిలో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. జేమ్స్ స్ట్రీట్ - సికింద్రాబాద్ రైల్వే ట్రాక్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే అధికారులకు సమాచారం అందింది. డివైఎస్ఎస్ సికింద్రాబాద్ నుంచి సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో సుమారు 40-45 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి అనారోగ్యం లేదా ఇతర కారణాల వల్ల గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. మృతుడు కాఫీ రంగు ఫుల్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఎత్తు సుమారు 5 అడుగులు 5 అంగుళాలు, చామనచాయతో, గుండ్రటి ముఖంతో ఉండగా, ఎడమ ఛాతి భాగంలో మచ్చ (మోల్) గుర్తుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440083160, 8712658581 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

# ఎంఎంసీలో స్వచ్ఛ సర్వేక్షణ సమీక్ష

**ఆర్ఆర్ఆర్ సెంటర్ల ఏర్పాటు - పరిశుభ్రతపై కట్టుదిట్టమైన చర్యలు..**




సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) నగరంలో పరిశుభ్రత మెరుగుపరిచేందుకు స్వచ్ఛ సర్వేక్షన్ పనులను వేగవంతం చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులకు ఆదేశించారు. గురువారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని చెత్త పేరుకుపోయే ప్రదేశాలను గుర్తించి వెంటనే తొలగించాలని, అక్కడ మళ్లీ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ కోసం రెడ్యూస్-రియూజ్-రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. పాన్ గుట్కా ఉమ్మే రెడ్ స్పాట్లు, బహిరంగ మూత్ర విసర్జన జరిగే ఎల్లో స్పాట్లను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంట చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రైనేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వర్షపు నీటి కాలువల నిర్వహణను బలోపేతం చేయాలని, నిర్మాణ వ్యర్థాలను సమర్థవంతంగా తొలగించాలని ఆదేశించారు. బల్క్ వేస్ట్ జనరేటర్లపై కఠిన పర్యవేక్షణ ఉండాలని, నగరంలో పబ్లిక్ టాయిలెట్ల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. పార్కులు, నీటి వనరులను సంరక్షించడంతో పాటు పాఠశాలలు, కమ్యూనిటీ ప్రదేశాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# చిలకలగూడలో అనుమానాస్పద వ్యక్తి అరెస్ట్

**60 రోజుల జైలు శిక్ష**



సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) చిలకలగూడ పోలీస్ పరిధిలో క్రైమ్ నైట్ బీట్ డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసులు ఒక అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 8 గంటల నుండి విధులు నిర్వహిస్తున్న పి.సి. జి. శ్రీకాంత్, హెచ్.జి. పిచ్చయ్యలు, తెల్లవారుజామున సుమారు 1:30 గంటల సమయంలో రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. అతన్ని ఆపి విచారించగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో తనిఖీ చేయగా అతని వద్ద ఒక చిన్న పదునైన కత్తి లభ్యమైంది. దీంతో అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా, తన పేరు సునీల్ (28), రాపిడో డ్రైవర్ అని, ప్రస్తుతం సికింద్రాబాద్‌లో నివసిస్తూ, స్వస్థలం కర్ణాటకలోని బీదర్ అని వెల్లడించాడు. ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని గురువారం ఉదయం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా అతనికి 60 రోజుల కారాగార శిక్ష విధించారు.

# చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి దారుణ హత్య

సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పేకాటలో అప్పులు చేసి తిరిగి చెల్లించకపోవడంతో సహచరులే ఈ హత్యకు పాల్పడినట్లు తెలిపిన పోలీసులు. మృతుడు ముషీరాబాద్ లో నివాసి ఏసి మెకానిక్ అలీమ్ (42) అదే ప్రాంతానికి చెందిన జహంగీర్ అనే వ్యక్తితో పేకాటలో డబ్బులు పొగకట్టుకొని అతడి వద్దే అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో కక్ష్య పెంచుకున్నాడు. ఈ రోజు సాయంత్రం సాయంత్రం అలీమ్, జహంగీర్ అతడి స్నేహితుడు ఇలియాస్ తో కలసి పద్మారావు నగర్ లోని కేవీకే వైన్స్ లో మద్యం సేవించారు. ముగ్గురి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. వైన్స్ నుండి బయటకు వచ్చిన వెంటనే జహంగీర్, ఇలియాస్ ఇద్దరు కలసి అలీమ్ పైన కత్తితో దాడి చేశారు. మెడపైన తీవ్ర రక్తస్రావమై కింద పడగ ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బడితుడ్ని వెంటనే గాంధీ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఇన్ స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ తెలిపారు. నిందితుడు ఇలియాస్ తమ అదుపులోనే ఉన్నాడని పేర్కొన్నారు.



# మెట్టుగూడలో బోరు సమస్య త్వరలో పరిష్కారం

సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మెట్టుగూడ డివిజన్ అమాలి బస్తీలో నెలకొన్న బోరు సమస్యపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలువురు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఆదం సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి కేవీస్ శిల్పాచారి గురువారం అధికారులతో కలిసి ఘటనాస్థలాన్ని సందర్శించారు. బోరు పరిస్థితిని పరిశీలించిన అధికారులు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు రెండు నుంచి మూడు రోజుల్లో బోరు సమస్యను పూర్తిగా పరిష్కరించి, ప్రజలకు తిరిగి నీటి సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు ఈ చర్యపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సమస్యను త్వరిత పరిష్కారం అందించాలని కోరుతున్నారు.

# రోడ్డుపై చెత్త కనిపించకుండా కఠిన చర్యలు: ఎంఎంసీ కమిషనర్

సికింద్రాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్) రహదారులపై ఎలాంటి వ్యర్థాలు కనిపించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం వెస్ట్ మారేడ్పల్లి పరిధిలోని ఆశ్విని కాలనీ, నెహ్రూ నగర్ పార్క్, హస్మత్పేట్ చెరువు, రాజరాజేశ్వరి నగర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. నెహ్రూ నగర్ పార్క్లో స్థానికులు, సీనియర్ సిటిజన్లతో మాట్లాడిన కమిషనర్ పార్క్ సదుపాయాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఫౌంటెన్ పునరుద్ధరణ, కొత్త ఫిట్నెస్ పరికరాల ఏర్పాటు, పార్క్ నిర్వహణలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. నెహ్రూ నగర్ ప్లే గ్రౌండ్లో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



ఆశ్విని కాలనీలో రోడ్లపై గ్రీన్ వేస్ట్, నిర్మాణ వ్యర్థాలను గమనించిన కమిషనర్ వెంటనే తొలగించేలా ఆదేశించారు. రహదారులు, ఫుట్పాత్లపై చెత్త పేరుకుపోకుండా నిరంతర శుభ్రత నిర్వహించాలని సూచించారు. ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రజల్లో అవగాహన పెంచి ఎర్లీ బర్డ్ డిస్కౌంట్ స్కీమ్ను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశించారు. అన్ని వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.



హస్మత్పేట్ చెరువులో లార్వా నియంత్రణ చర్యలను పరిశీలించి ఆయిల్ బాల్స్, డ్రోన్ స్ప్రేయింగ్ వినియోగాన్ని సూచించారు. నీటి వనరుల్లో పూజా సామాగ్రి, ఆహార పదార్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రాజరాజేశ్వరి నగర్, శ్రీ సాయి ఎన్క్లేవ్ ప్రాంతాల్లో దోమల పెరుగుదల కేంద్రాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని సూచించారు. భవనాల ర్యాంపులు రోడ్లపైకి విస్తరించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాప్రా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్‌కు నూతన కమిటీ

**ఏకగ్రీవంగా ఎన్నికలు – కార్మిక హక్కుల సాధనకు కట్టుబాటు.**

కాప్రా సర్కిల్, ఏప్రిల్ 23 (మనం న్యూస్): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం లక్ష్యంగా కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేయడం విశేషం.

ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి. శ్రీధర్, ఉపాధ్యక్షుడు భిక్షపతి, సలహాదారు ఎ. నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని ఎన్నికలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నూతన అధ్యక్షుడిగా బి. రాజ్కుమార్ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా ఎస్. అబ్బులు కొనసాగనున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎ. యాదగిరి, కోశాధికారిగా బి. యెల్లయ్య, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఇ. బాబు బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షుడిగా బి. బాబురావును ఎంపిక చేశారు. అలాగే కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సేతల్, సలహాదారుగా నటేష్ను నియమించారు.



ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వేతన సమస్యలు, ఉద్యోగ భద్రత, సేవా నిబంధనలలో స్పష్టత వంటి అంశాలపై ప్రాధాన్యతగా పని చేస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో యూనియన్ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

**యూనియన్ బలోపేతానికి కృషి**

యూనియన్ను మరింత బలోపేతం చేసి, ప్రతి ఉద్యోగికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగుతూ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం నూతన కమిటీకి సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.



